
ప్రజాశక్తి
శనివారం 14 సెప్టెంబర్ 2024



సోమవారం గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గ్రీవెన్స్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)ను సోమవారం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 16న మిలాద్ ఉన్ నబి సందర్భంగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినందున సోమవారం జరుగు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించబడదని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి వ్యయ ప్రయాసలకు గురి అవుతూ పార్వతీపురం వరకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

దేశ రాజకీయాల్లో ఏచూరిది చెరగని ముద్ర

సిపిఎం, ప్రజాసంఘాల నాయకుల నివాళ్లు

ప్రజాశక్తి - కొమరాడ

భారతదేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరిది చెరగని ముద్ర అని, పేదల సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన మేధావి అని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా కొమరాడ, దేవకోన పంచాయతీ అంటివలసలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల కోసం రాజీ లేని పోరాటం చేసిన మేధావి సీతారాం ఏచూరి, దేశ రాజకీయాల్లో గౌరవాన్ని పొందారని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వెంకటేష్, రెడ్డి శివుని నాయుడు, సాయిరాం, అప్పలనాయుడు, కాంతర్ బాబ్జీ, వెంకటేశు, బలరాం, సుబ్బారావు, రామారావు, రామస్వామి పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : సీతారాం ఏచూరి మరణం పార్టీకి, పీడిత, కార్మిక, కర్షక వర్గాలకు తీవ్ర లోటని సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివసరావు అన్నారు. మరిపల్లిలో ఏచూరి సంతాప సభ నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు, నాయకులు రాజమండ్రి రాము, గొర్లెల లక్ష్మణ, ఆల్తి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ : ఏచూరి చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి దావాల రమణారావు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏచూరి జీవితం కమ్యూనిస్టు ఉద్యమానికి ఆదర్శమని, ఆయన ఆశ సాధన కోసం పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాదా రాము, దూసి దుర్గారావు, గిరి, హేమసుందరరావు, ప్రజాసంఘాల కార్యకర్తలు దూసి పాపారావు, గుండు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : ప్రజాశక్తి దినపత్రిక కార్యాలయంలో బాధ్యులు ఎస్.పోలినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విలేకరులు నాగు కాకిముక్కల, సిహెచ్.వెంకటరమణ, ఆఫీస్ ఇంచార్జి వెన్నెల చిన్నంనాయుడు, సర్క్యులేషన్ ఇన్చార్జి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బుడ్డిపేటలో సీతారాం ఏచూరి చిత్రపటానికి స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జి.వెంకటరమణ మాట్లాడుతూ ఏచూరి ఆశయ సాధనకు పార్టీ సభ్యులు, సానుభూతిపరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు ఆర్. రాము, వై. రామారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండలో ఏచూరికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

సీతంపేట : కోసంగిలో సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు పి.సాంబయ్య, జె.సుందరమ్మ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో కష్టజీవుల తరుపున అలుపెరుగని పోరాటం చేసిన సీతారాం ఏచూరి మరణం సిపిఎంకు, కష్ట జీవులకు తీరని లోటని అన్నారు. నాయకులు గంగాధర్, శ్రీరాములు, మధు సుధను, నీలయ్య దుర్గా రావు తదితరులు పాల్గున్నారు.

గరుగుబిల్లి : ఏచూరికి గరుగుబిల్లి, సుంకిలో పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బివి రమణ, కరణం రవీంద్ర మాట్లాడుతూ ఏచూరి ఆయన ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జగ్గారావు, దాసరి వెంకటనాయుడు, రెడ్డి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సంతాపం

పార్వతీపురం రూరల్ : పేదల సమస్యలపై రాజీ లేని పోరాటం చేసిన మేధావి సీతారాం ఏచూరి అని, ఆయన మృతితో దేశంలో అట్టడుగు వర్గాల ప్రజల గొంతు మూగబోయిందని ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల ఆయన తన తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు కూడా ఏచూరి మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు దేశం పేదల తరపున పోరాడే ఘనమైన నాయకుడ్ని కోల్పోయిందని ఈ లోటు ఎప్పటికీ భర్తీ చేయలేనిదని అన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి బత్తిన మోహన్‌రావు మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి, చట్టసభల్లో తన ప్రసంగాల ద్వారా తన రచన వ్యాసంగా ద్వారా ఎందరో అభిమానుల్ని దేశవ్యాప్తంగా సంపాదించుకున్న నాయకుడు కోల్పోవడం బాధాకరమని అన్నారు.




కొమరాడ, సీతంపేటలో సీతారాం ఏచూరి చిత్రపటాల వద్ద నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం పాచిపెంట, సాలూరు, మక్కువ మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి పథకాల అమలును పరిశీలించారు. విశాఖపట్నం నుంచి రాయపూర్ వరకు నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే ఎన్ హెచ్ 130 సిడి రోడ్డు పనులను పాచిపెంట మండలం మాతుమూరు వద్ద జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రోడ్డుకు వాహనాలు వచ్చి వెళ్లే మార్గాలను, వంతెన నిర్మాణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దిష్ట సమయంలోగా పనులు పూర్తి చేయాలని హెచ్‌జి ఇన్ఫ్రా ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం మండలంలోని పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రిజర్వాయర్ నీటి సామర్థ్యం ప్రస్తుత నీటి నిల్వ వివరాలను, గేట్లు, కాలువల పరిస్థితిని జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 0.949 టిఎంసిల రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.452 టిఎంసిల నీరు ఉందని కలెక్టర్‌కు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రిజర్వాయరులో వాటర్ ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రిజర్వాయర్ల స్థితిగతులను పరిశీలనకు పర్యటించామన్నారు. పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను పర్యాటకంగా, ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొంది స్తున్నట్లు తెలిపారు. కెనాల్‌లో నిర్వహణ, మరమ్మతులను త్వరలో మ్యాచింగ్ గ్రాండ్ నిధులతో పనులు ప్రారంభించనున్నట్లు స్పష్టం చేశారు.

జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శన

పాచిపెంట మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టరు



గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సందర్శించారు. తరగతిగదులు, హాజరు, విద్యార్థుల పఠనాశక్తి, నోటు పుస్తకాలు తనిఖీ చేశారు. సమ్మెటివ్ పరీక్షల్లో మార్కుల ఆధారంగా ఉపాధ్యాయులు తరగతిలో చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అవసరమైతే అదనపు తరగతులు నిర్వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను అవలోకనం చేసుకుని పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. అనంతరం పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న చిన్నారులకు నిర్వహిస్తున్న రక్త పరీక్షలను పరిశీలించారు. ఒక విద్యార్థినికి స్వయంగా రక్తపరీక్ష నిర్వహించి రక్తంలోని హిమోగ్లోబిన్ ఫలితాలను పరిశీలించారు. రక్తహీనత ఉండడం వల్ల విద్యార్థుల శారీరక ఎదుగుదల లోపిస్తుందని, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, ప్రధానోపాధ్యాయులు బాధ్యతగా తీసుకొని పౌష్టికాహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అవసరమైన వారికి ఐరన్ మాత్రలు అందివ్వాలన్నారు. మన బడి - మన తోట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్‌ను పెంపొందించాలన్నారు. తాజా కూరగాయలు, ఆకుకూరలు ద్వారా పొందే పౌష్టికాహార విలువలు గూర్చి పిల్లలకు అవగాహన కల్పించాలని తెలిపారు.

చెక్‌పోస్టు తనిఖీ

ఆంధ్రా, ఒడిస్సా సరిహద్దులో పి.కోనవలస వద్ద గల చెక్ పోస్ట్‌ను కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతరాష్ట్ర చెక్ పోస్టు కావడంతో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, విధులను అప్రమత్తంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వాహనాల తనిఖీ, సిబ్బంది హాజరు రిజిస్టరులను కలెక్టరు పరిశీలించారు. ఇప్పటివరకు నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరాల నిఘాను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కె. హేమలత, ఇరిగేషన్ ఇఇ ఆర్.అప్పల నాయుడు, డిఇ కనకారావు, హెచ్‌జి ఇన్ఫ్రా కంపెనీ సిజిఎం రాజశేఖర్, సీనియర్ మేనేజర్లు రవికుమార్ అంబాల, శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ వికాస్ వర్మ, ఎజిఎం రాజేంద్ర మీనా, హైవే మేనేజర్ అబయ్ ఠాకూర్, తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ లక్ష్మీకాంత్, ఎఇ రవి కుమార్, వెంకట్, సంధ్య, హెచ్‌ఎంలు బి.ఈశ్వర రావు, ఎ.యశోద, తదితరులు పాల్గొన్నారు.

27న విశాఖలో ప్రాంతీయ డాక్ అదాలత్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఈనెల 27న విశాఖలో 115వ ప్రాంతీయ స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ ప్రాంత పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ డాక్ అదాలత్ ఎంవిపి బస్ కాంప్లెక్స్, విశాఖపట్నం-530017 పోస్ట్ మాస్టర్ జనరల్ ద్వారా, విశాఖపట్నం రీజియన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా సభ్యుల నుంచి పోస్టల్ సేవలకు సంబంధించిన నిర్దిష్ట వ్యక్తిగత ఫిర్యాదులు అదాలత్ ద్వారా స్వీకరించబడతాయని అన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీన, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పైన పేర్కొన్న స్వభావం యొక్క ఫిర్యాదులు కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, కేరాఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, విశాఖపట్నం రీజియన్, విశాఖపట్నం 530017 చిరునామాకు ఈనెల 23లోగా పంపించాలన్నారు. ఎన్వలప్‌లపై "115వ దక్ అదాలత్" అనే పదాలు రాయాలని ప్రకటనలో తెలిపారు.

పేదలకు పట్టాలివ్వాలి

భూ ఆక్రమణదారులపై చర్య తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - మక్కువ

పేదల అనుభవంలో ఉన్న భూములకు ఇళ్లు, సాగు పట్టాలు ఇవ్వాలని, తూరుమామిడి జగనన్న కాలనీ ఇళ్ల స్థలాల్లో చేసిన అక్రమాలపై దర్యాప్తు చేసి అధికారులను సస్పెండ్ చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. భూ హక్కు దారులకు భూమి అప్పజెప్పాలని, హక్కుదారుల్లేని భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, సర్పంచ్ నుంచి డబ్బు రికవరీ చేయాలని, ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన మక్కువలోని మజ్జి గౌరమ్మ గుడి నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ చేసి తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల భూములు అనేకమంది పెత్తందారులు అన్యాక్రాంతం చేశారని, వాటిని వెంటనే తీసుకొని వైసిపి చేసిన అమెండ్మెంట్ ప్రకారం తిరిగి పట్టాదారులకు ఇవ్వాలని, పట్టాదారు లేకపోతే పిఒటి బుక్ చేసి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అలాగే భూకబ్జాదారులు మండలంలో చెరువులను కబ్జా చేసి హోటళ్లు, భవనాలు, మందుల షాపులు కిరాణా షాపులు నిర్మించారని, వాటిపై ముందుస్తు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ డిమాండ్ చేశారు. అంతేకాక పేదలు కట్టుకున్న ఇళ్లను పీకేస్తామంటే ఊరుకునేది లేదనిహెచ్చరించారు. కొండపోడు



మక్కువలో ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

చేస్తున్న గిరిజనులకు అటవీ హక్కు చట్టం ప్రకారం పోడు పట్టా పది ఎకరాల వరకు ఒక కుటుంబానికి ఇవ్వాల్సి ఉన్నా రెవిన్యూ అధికారులు పాతిక, 50 సెంట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని అన్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించమన్నారు. రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున గిరిజనులను కదిలించి ఆందోళన ఉధృతం చేసి 10 ఎకరాల వరకు పట్టా కోసం పోరాడుతామని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొల్లి గంగనాయుడు, వి.ఇందిరా మాట్లాడుతూ మండలంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన, స్థానికంగా ఉన్న పెత్తందారులు పేదల భూములు అన్యాక్రాంతం చేసి వారిపై దౌర్జన్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తహశీల్దార్ ఇప్పటికైనా మండలంలోని అసైన్డ్ భూముల జాబితా 22-ఎ భూములు జాబితా బహిరంగ పర్చి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, గిరిజనులు, పేదలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గ్రామసభ తీర్మానంతోనే ఉపాధి పనులు : కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరురూరల్

పంచాయతీ గ్రామ సభల తీర్మానాలతోనే ఉపాధి హామీ పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ చెప్పారు. పాచిపెంట మండల పర్యటనకు వచ్చిన ఆయన పి.కోనవలస అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు ప్రాధాన్యతా క్రమంలో ప్రారంభిస్తామని చెప్పారు. పాచి పెంట మండలం లో పారిశ్రామిక వాడ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదన పరిశీలనలో వుందని, అయితే అవసరమైన ప్రభుత్వ భూమి అందుబాటులో లేదని చెప్పారు. ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు వున్నాయని, దీనిపై కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. పెద్ద గెడ్డ రిజర్వాయర్, పారమ్మకొండ, గిరి శిఖర గ్రామాల్లో ఉన్న వాటర్ ఫాల్స్ పర్యాటక ప్రదేశాలుగా గుర్తించి అభివద్ధి చేయాలనే ప్రతిపాదనలు వున్నాయని చెప్పారు.

తప్పు లేకుండా ఎవరినీ తొలగించరు

జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగుల తొలగింపు గురించి ప్రశ్నించగా కారణం లేకుండా ఎవర్నీ తొలగించరని చెప్పారు. తప్పు చేసినట్లు నిర్ధారణ అయితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. జియ్యమ్మవలస మండలంలో తొమ్మిది మంది విఒఎలను తొలగించడంపై మాట్లాడుతూ కొంతమంది స్త్రీనిధి నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. అవినీతి ఆరోపణలపై నలుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేశామని చెప్పారు.



ట్రాఫిక్ నిలిచిపోవడంతో నడిచి వస్తున్న ప్రయాణికులు

గోతుల్లో నిలిచిపోతున్న వాహనాలు

- 24 గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గంగరేగువలస నుంచి కూనేరు వరకు గల అంతర్రాష్ట్ర రహదారి అధ్వానంగా మారడంతో రాయగడ నుంచి విశాఖపట్నం, విశాఖపట్నం నుంచి రాయగడ వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ గోతుల్లో నిలిచిపోతున్నాయి. దీంతో స్థానికులు లారీ డ్రైవర్ల సహాయంతో వాహనాలు తొలగించి కొంతమేరకు ట్రాఫిక్ అంతరాయాన్ని నివారిస్తున్నప్పటికీ గురువారం ఉదయం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు గుమడ వద్ద ఒక వాహనం తర్వాత మరో వాహనం గోతిలో ఉండిపోవడంతో తీవ్రంగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో దాదాపు 24 గంటల నుంచి రోడ్డుపైన లారీలు, కార్లు ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యావసర సేవలైన 108 అంబులెన్సులు కూడా ఈ రోడ్లో వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం ఉదయం కూడా వాహనాలు గోతుల్లో నుంచి బయటికు రాకపోవడంతో భారీ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో వందలాది లారీలు కార్లు, చిన్న చిన్న వాహనాలు సైతం రోడ్డుపైన ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వేరే మార్గం లేక ఆ దారిలో పడి కాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్వతీపురం నుంచి కూనేరు, రాయగడ వెళ్లే బస్సులు కూడా గుమడ వద్దే వెను తిరిగాయి. ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి వల్ల ప్రయాణికులు దిగిపోయి నడుచుకొని ఈ చివరకు వచ్చి ప్రైవేటు వాహనాలను ఎక్కి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు ఏర్పడిన రోడ్డులను కప్పి మరమ్మతులు చేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు ప్రయాణికులు కోరుతున్నారు.

వైటిసి అభివృద్ధి పనులు పరిశీలించిన జెసి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక వైటిసి జరుగుతున్న గర్భిణుల అదనపు గదుల అభివృద్ధి పనులను జాయింట్ కలెక్టర్ శోభిక శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో నాణ్యతను పరిశీలించారు. గర్భిణీలకు బెడ్లు ఏర్పాటు చేయాలని, శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వేడినీటి సౌకర్యం కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు, వైటీసీ మేనేజర్ రాముకు సూచించారు. గర్భిణీలకు అందుకున్న సేవలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని అన్నారు. అనంతరం డిఎస్‌సి కోచింగ్ గదిని పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి రికార్డులు పరిశీలించారు. జిల్లాలో జియో, ఎయిర్టెల్, బిఎస్ఎన్ఎల్ 190 సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జెసి తెలిపారు. సెప్టెంబర్, అక్టోబర్ నుంచి పనులు ప్రారంభిస్తామని అన్నారు. జిల్లాలో 80శాతం గ్రామ సభల నిర్వహణ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధికారులు పాల్గొన్నారు.

'వందే భారత్'లో పార్వతీపురానికి మొండిచేయి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఈనెల 15న ప్రారంభించనున్న దుర్గ్-విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు విషయంలో పార్వతీపురానికి రైల్వే శాఖ మొండి చేయి చూపింది. మొదట రైల్వే అధికారులు పార్వతీపురంలో హాల్ట్‌కు ప్రతిపాదనలు పంపినప్పటికీ తదనంతర పరిణామాల్లో, పార్వతీపురం హాల్ట్ లేకుండా విజయనగరం, రాయగడలో ఆగేలా షెడ్యూలు విడుదల చేశారు. వందే భారత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్న పార్వతీపురం ప్రయాణికులకు ఈ వార్త తీవ్ర నిరాశపర్చింది. దీంతో స్పందించిన స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హుటాహుటిన శుక్రవారం విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్‌ను కలిసి గిరిజన ప్రాంతాల ప్రజలతో పాటుగా వర్తక, వాణిజ్య, ఉద్యోగ వ్యాపార వర్గాలకు ఎంతగానో ఉపకరించే జిల్లా కేంద్రం పార్వతీపురంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ హాల్టు కల్పించకపోవడం ఇక్కడ ప్రజలకు తీవ్రమైన అన్యాయంగా భావిస్తున్నామని, ఈ విషయంలో అధికారులు పునరాలోచన చేసి పార్వతీపురం స్టేషన్లో ఎక్స్‌ప్రెస్ ఆగేలా ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు.

వందే భారత్ ట్రయల్ రన్ విజయవంతం

కొమరాడ : విశాఖపట్నం నుంచి దుర్గ్ వరకు ఈనెల 15నుంచి తిరగనున్న వందే భారత్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం దుర్గ్‌లో బయలుదేరి పార్వతీపురం మీదుగా విశాఖపట్నం వందే భారత్ ప్రత్యేక ట్రైన్ ట్రయల్ రన్ భాగంగా అప్ట్రెన్ ట్రాక్పై రైల్వే అధికారులు విజయవంతంగా ట్రైలర్ నిర్వహించారు. ఈనెల 15 నుంచి మన్యం జిల్లా మీదుగా రాయపూర్, దుర్గ్‌కు ఈ రైలును నడిపేందుకు రైల్వే శాఖ అధికారులు సిద్ధమయ్యారు. ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు.



డిఆర్‌ఎంకు వినతిని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

శ్యామలాంబ పండగపై సమీక్ష

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి చెందిన శ్యామలాంబ పండుగ నిర్వహణపై జమిందార్ విక్రమ చంద్ర సన్యాసి రాజు నివాసంలో పురప్రముఖులతో సమీక్ష నిర్వహించారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే భంజ్ దేవ్, సీనియర్ నాయకులు జర్జాపు సూరిబాబుతో పాటు వివిధ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు హాజరయ్యారు. పదేళ్ల తర్వాత నిర్వహిస్తున్న పండుగ తీరుతెన్నుల గురించి చర్చించారు. గతంలో పండుగ సందర్భంగా ఎదురైన ఇబ్బందులు, అనుభవాలను దృష్టి లో పెట్టుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.వచ్చే ఏడాది మే నెలలో శ్యామలాంబ పండుగ నిర్వహించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

అంతా కలిసి ఆలయాన్ని అభివృద్ధి చేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి -మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్య దేవతగా పేరు పొందిన శంబర పోలమాంబ ఆలయాల అభివృద్ధికి అంతా కలిసి పనిచేద్దామని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. శుక్రవారం వనం గుడి వద్ద అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి సంబంధించి ఏడు రహదారులను ఇప్పటికే మంజూరు చేశామన్నారు. అలాగే చదురుగుడి సమీపంలో షెడ్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయాలకు సంబంధించి సుమారు రెండు ఎకరాల 46 సెంట్లు భూమి ఉందని అధికారులు వివరించారు. ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పూడిదాలి నాయుడు జాతర సందర్భంగా ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్ వివరించారు. ఆలయ పూజారులు తమకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు.

మా సంగతి సరే... మీరేమిస్తారు?

ప్రభుత్వం మేము ఏంస్తామన్నది అటునుంచి గ్రామస్తులుగా పోలమాంబ భక్తులుగా మీరేమిస్తారని కలెక్టర్ స్థానికులను ప్రశ్నించారు. దీనిపై ఎవరి నుండి ఏ విధమైన సమాధానం రాలేదు. దీనిపై ఆయన స్పందిస్తూ ప్లాస్టిక్ నిర్మూలించాలని, పారిశుధ్యం మెరుగకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఎవరో వస్తారు.. వారే చేస్తారు అన్న అంశంపై దృష్టి పెట్టకుండా ఈసారి జాతరలో ప్రజలే వాలంటీర్‌గా సహకరించాలని సూచిం చారు. కార్యక్రమంలో ఆర్డీవో హేమలత, దేవాదాయ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పీసా ఎన్నికలు నిర్వహించాలి : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో పీసా ఎన్నికలు నిర్వహించాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పీసా చట్టంపై అవగాహన కార్యక్రమం ఐటిడిఎలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈనెల 24 నుంచి అక్టోబర్ 8లోపు సీతంపేట మండలంలోని 41 పంచాయతీల్లో 102 గ్రామ సభలు నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాలని అధికారులకు సూచించారు. పీసా ఎన్నికల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎపిఒ దినబాబు, తహశీల్దార్ అప్పలరాజు, ఎంపిడిఒ గీతాంజలి, ఆర్వోఎఫ్‌ఆర్ డిటి కుమార్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు లేని ఆంక్షలు ఇప్పుడెందుకు? : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

వినాయక విగ్రహాల నిమజ్జనంపై గతంలో అనుసరించిన విధానాలనే పోలీసులు, అధికారులు పాటించాలని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. శుక్రవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వినాయక విగ్రహాల నిమజ్జనంపై గతంలో ఎన్నడూ లేని ఆంక్షలు ఇప్పుడెందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. తొమ్మిది రోజులకే ఉత్సవాలు ముగించి నిమజ్జనం చేపట్టాలని అధికారులు ఆంక్షలు విధించడం సరైన నిర్ణయం కాదన్నారు. పట్టణంలో కొన్ని వీధుల్లో మాత్రమే వినాయక నిమజ్జనం 21రోజుల తర్వాత నిర్వహిస్తారని, అనాదిగా వస్తున్న సాంప్రదాయాన్ని గౌరవించాలని సూచించారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా పండుగలు నిర్వహించుకునే సాంప్రదాయం గతంలో వుందని, భవిష్యత్తులోనూ కొనసాగాలని కోరారు.

14, 15 తేదీల్లో హిందీ పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 14, 15వ తేదీల్లో హైదరాబాద్ హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో విశారద, భూషణ్, విద్వాన్ తదితర పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హిందీ కేంద్ర వ్యవస్థాపకులు సంతోష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా ప్రధానోపాధ్యాయులు బి.శంకరరావు, డిపార్ట్‌మెంట్ అధికారిగా ఎంఇఒ సత్యనారాయణ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

20 ఎకరాల్లో అరటిపంట నష్టం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబర, నడుకూరులో ఇటీవల తుపాను ప్రభావంతో 20 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లినట్టు ఉద్యానశాఖ ఎఒ టి.ఉమాశేశ్వర తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నడుకూరు, కంబర గ్రామాలకు చెందిన సుమారు 19 మంది రైతులకు సంబంధించి అరటి పంటనష్టం జరిగిందని, రైతుల వివరాలు ఆన్లైన్లో పొందుపరిచి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్టు ఎఒ తెలిపారు.

జిఒ 115ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిఒ 115ను రద్దు చేసి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ లకు న్యాయం చేయాలని ఎఐటియుసి కార్యదర్శి ఒబి ఎస్ కుమార్ అన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయకుండా కొత్తగా రిక్రూట్ చేపట్టడంపై కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు స్థానిక జిల్లా ఆసుపత్రి ఆవరణలో మూడు రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నారు. వీరి ఆందోళనకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 115 ద్వారా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వారి బాధల్ని అర్థం చేసుకుని వారిని రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు సిహెచ్ రమణమూర్తి, ఎస్. నారాయణరావు, పి.భారతి, పి.లక్ష్మి, అనుశ్రీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని సన్యాసిరాజుపురం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం మక్కువ మండల ప్రత్యేక అధికారి అశోక్ కుమార్, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఎంఇఒ-1 పెంట సత్యనారాయణ సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలినాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం అందజేత

ప్రజాశక్తి - కురుపాం

విజయవాడ వరద బాధితులకు ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఐ.రామకృష్ణ మొండెంఖల్, నీలకంఠాపురం గ్రామాల్లో బియ్యం సేకరించి కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం వరద బాధితుల వద్దకు పంపిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల వల్ల స్వరం కోల్పోయి తిండికి కూడా ఇబ్బందిపడుతున్న ప్రజలకు తమ వంతు సహాయంగా బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నీలకంఠాపురం ఎస్సై నీలకంఠరావు, సర్పంచులు ఎ.మన్మథరావు, ఐ.గౌరీశంకర్, టిడిపి నాయకులు శంకర్ , బెహర్ ప్రదీప్, లాడి రమేష్, ఆదివాసీ జెఎసి నాయకులు బిడ్డక రామారావు పాల్గొన్నారు.

ఏగోటివలసలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లక్ష్మీపురం సచివాలయ పరిధిలో గల ఏగోటి వలసలు పెదంకలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.రాధాకాంత్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజికల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణీలకు తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రమం తప్పకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలని, మందులు సక్రమంగా వాడాలన్నారు. బిపి, షుగర్ రోగులు తనిఖీలు నిర్వహించే వారికి మందులు సప్లై చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం రమాదేవి, ఎంఎల్‌హెచ్‌బి కె.హరిప్రియ, హెచ్ఎస్ గోపాల రావు, హెల్త్‌అసిస్టెంట్ వెంకటేష్, 104 సిబ్బంది రాజు, నవీన్ పాల్గొన్నారు.

యోగా, వాలీబాల్ పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల్లో మండలం, మున్సిపాలిటీలోని అన్ని ఉన్నత పాఠశాలల నుంచి యోగా, వాలీబాల్ నియోజకవర్గ స్థాయి ఎంపిక కొరకు వందకు పైగా విద్యార్థులు హాజరైనట్లు సమన్వయకర్త బి శ్రీనివాసరావు తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ రమేష్ రామన్, ఎంఇఒ కె.ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు గౌరీ, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు మంతిని వాసుదేవరావు నాయుడు, కె.తిరుపతిరావు, గాంధీ ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల స్పెషల్ ఆఫీసర్ క్రాంతి కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది కార్యదర్శి అమరపు సూర్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు గౌరు నాయుడు, మురళి,చిట్టి బాబు, చిరంజీవి సరస్వతి, వైకుంఠ రావు తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన వారు నియోజకవర్గ ఎంపికలో పాల్గొనాల్సి ఉందని శ్రీనివాస రావు తెలిపారు.

ఎరువుల దుకాణాన్ని పరిశీలించిన ఎడి

ప్రజాశక్తి - సీతానగరం

స్థానికంగా ఉన్న గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని వ్యవసాయ సంచాలకులు టి.వెంకటేష్ శుక్రవారం పరిశీలించారు. ఎరువులు, పురుగు మందులను ఐసిసి తనిఖీలు నిర్వహించారు. అనంతరం దస్తావేజులను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక ధరలకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో ఎస్ అవినీష్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని తెట్టంగికి చెందిన పాలకొండ ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, సుమతి దంపతులు శుక్రవారం కుమారుడు దివంగత పొట్నూరు ముఖేష్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సుమారు రూ.18 వేలు విలువ గల స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రధాన ఉపాధ్యాయులు డి.నాగమణి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, పాల్గొన్నారు.



విద్యార్థులకు వాటర్ బాటిళ్లను అందజేస్తున్న ఎఎంసి ఉపాధ్యక్షులు లక్ష్మణరావు

ఉలిపిరి ఆశ్రమ పాఠశాలలో ఏం జరుగుతోంది?

- హెచ్ఎం కుర్చీ కోసం పాకులాట
- ఒకరిపై మరొకరు ఫిర్యాదులు

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో నడుస్తున్న అనేక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ఏదో ఒక సంఘటనతో వార్తల్లోకి రావడం చూస్తూ ఉంటాం.. విద్యార్థులకు సరిగ్గా భోజనం పెట్టకపోవడం, ఉపాధ్యాయులు పిల్లలకు చదువులు చెప్పకపోవడం, ఉపాధ్యాయులు సమయానికి రాకపోవడం చూస్తూ ఉంటారు కానీ కొమరాడ మండలం ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఘటన పార్వతీపురం ఐటిడిఎలోనే ఆశ్చర్యాన్ని కలిగించే పరిస్థితి ఏర్పడింది. ఈ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల కుర్చీ కోసం కొంతమంది ఉపాధ్యాయులు పాకలాడుకోవడంతో అటు విద్యార్థులను, తల్లిదండ్రులను ఇటు ఉపాధ్యాయులను చర్చ రచ్చకెక్కుతుందని చెప్పొచ్చు. ఈ విషయం అంతా జిల్లా స్థాయి అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరించడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

మండలంలోని ఉలిపిరి ఆశ్రమ పాఠశాలలో మాత్రం ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపం మనస్పర్థలు వ్యక్తిగత కారణాలవల్ల ఒకరిపై ఒకరు తప్పుడు ఆరోపణలు చేసుకుంటూ వార్తల్లోకి ఎక్కుతున్నారు. దీంతో అక్కడ పనిచేస్తున్న తోటి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఇక్కడ పనిచేసిన మహిళా ఉపాధ్యాయురాలు ప్రస్తుతం పని పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిపై వివిధ కారణాలతో ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. ఆ విషయంపై జిల్లా స్థాయి అధికారులు స్పందించి డిప్యూటీ డిఇఒతో పాటు కమిటీ సభ్యులను విచారణకు ఆదేశించారు. విచారణ అనంతరం నివేదికలు ఉన్నతాధికారులకు పంపించి ఇక్కడ పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలు తప్పుడు ఫిర్యాదులు చేశారని నిర్ధారించి ఆమెను వేరే ఆశ్రమ పాఠశాలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఇంతవరకు సక్రమంగా జరిగినప్పటికీ అసలు కథ అక్కడే మొదలయ్యింది. 2022-23 విద్యా సంవత్సరంలో పనిచేసిన మహిళా ప్రధానోపాధ్యాయులు ప్రస్తుతం అదే పాఠశాలలో సబ్జెక్టు టీచర్‌గా పని చేస్తున్నారు. రెండేళ్ల క్రితం కురుకుట్టి ఆశ్రమ పాఠశాల నుంచి బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు వచ్చిన వెంటనే డిప్యూటేషన్‌పై ఇతర ఆశ్రమ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఆ సమయంలో అక్కడ సబ్జెక్టు టీచర్‌గా పని చేస్తున్న లక్ష్మీకాంతంను ప్రధానోపాధ్యాయులుగా అధికారులు నియమించారు. అనంతరం 2024 జూన్‌లో పాఠశాలలు ప్రారంభమైన సమయంలో ఆమె డిప్యూటేషన్ రద్దు చేయడంతో తిరిగి ప్రధానోపాధ్యాయులుగా కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి అతనిపైనా, గతంలో పనిచేసిన హెచ్ఎం లక్ష్మీకాంతంపై ఒక మహిళ ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేయడంతో ఈ గొడవ కాస్త జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీంతో ఇక్కడి ప్రధానోపాధ్యాయులు కుర్చీకై పాకులాడేందుకు ఇద్దరి మధ్య జరుగుతున్న వ్యక్తిగత కారణాలవల్లే ఇలా ఒకరిపై ఒకరు తప్పుడు ప్రచారాలు, ఫిర్యాదులు చేసుకొని అధికారులకు అనేక రకాలుగా వినతులు, ఫిర్యాదులు అందజేస్తున్నారని తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుంచి ఆరోపణ వినిపిస్తున్నాయి. ఈ గొడవల వల్ల పిల్లలకు సక్రమంగా పాఠాలు చెప్పేందుకు ఇబ్బందులు పడుతున్నామని అక్కడున్న ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఏదేమైనా ఈ పాఠశాలలో జరుగుతున్న అన్ని విషయాలు జిల్లా స్థాయి అధికారులకు తెలిసినప్పటికీ వారు చూసీ చూడనట్లు పట్టించుకోకపోవడంతో ఈ గొడవలు రోజురోజుకూ పెద్దవిగా మారడంతో విద్యార్థులు, అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్పందించి ఈ పాఠశాలలో జరుగుతున్న గొడవలకు కారణాలు తెలుసుకొని అర్హులైన వారికి ప్రధానోపాధ్యాయులు సీటు కేటాయించి గొడవలు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎస్ఎఫ్ఐ సందర్శన

గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో పనులు చేయించడం సరికాదని అలా చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకునే వరకూ పోరాటం చేస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి పండు అన్నారు. మండల ఎస్ఎఫ్ఐ అధ్యక్షులు కె.డేవిడ్‌తో కలిసి ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఇక్కడి విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని, అలాగే విద్యార్థులే టీచర్లకు భోజనాలు వడ్డించడం, టీలు పంపిణీ చేయడం, గేటు తాళాలు తీయడం, ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు రావడంలేదని పాఠాలు సక్రమంగా బోధించడంలేదంటూ వచ్చిన ఫిర్యాదులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. అయితే విద్యార్థులు మాత్రం ఉపాధ్యాయులు సకాలంలో విధులు వస్తున్నారని, పాఠాలు బోధిస్తున్నారని, తమతో ఎలాంటి పనులు చేయించడంలేదని సమాధానం ఇచ్చారు. ఫిర్యాదు చేసిన ఫొటోలన్నీ రెండేళ్లక్రితం అని విద్యార్థులు తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, డి. పండు, మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా మంచిగా చదవాలన్నారు. అలాగే పాఠశాలలో 350 మంది విద్యార్థులకు ఒక్కరే పనిమనిషి ఉండడం దారుణమన్నారు. తక్షణమే వాచ్మెన్‌ను నియమించాలని పడిపోయిన ప్రహరీ గోడను నిర్మించాలని, డిప్యూటేషన్‌పై వెళ్లిపోయిన తెలుగు టీచర్ స్థానంలో ఆ సబ్జెక్టు ఉపాధ్యాయుడ్ని నియమించాలని అధికారులకు కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు ఉన్నారు.



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్

యుటిఎఫ్ నాయకులు సందర్శన

ఉలిపిరి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై వస్తున్న ఆరోపణ నేపథ్యంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు బాగానే పాఠాలు చెబుతున్నారని, సకాలంలో వస్తున్నారని విద్యార్థులు తెలిపారు. పాఠశాల గేటు వద్ద విద్యార్థులను ఎందుకు ఉంచుతున్నారని అడగ్గా తమకు వాచ్మెన్ లేరని, అందుకే పిల్లల సహాయం తీసుకుని ఉంచుతున్నామన్నారు. ఉన్న ఒక్క వర్కర్ విద్యార్థులందరికీ భోజనాలు పెట్టడం ఇబ్బందిగా ఉండడంతో పిల్లల సహాయం తీసుకుంటామని తెలిపారు. టీచర్లంతా పీరియడ్ ప్రకారం వస్తున్నారా అని విద్యార్థులను అడగ్గా, అంతా సకాలంలో వచ్చి పాఠాలు చెబుతున్నారని తెలిపారు. అన్నీ సక్రమంగా ఉన్నప్పుడు ఎందుకు ఫిర్యాదు చేశారని ఉపాధ్యాయులను అడగ్గా అదంతా కక్ష సాధింపుగా చేసిన తప్పుడు ఫిర్యాదని, ఇందులో ఏ ఒక్కటీ వాస్తవం లేదని, ఇందులో కొంతమంది స్వార్థం ఉందని అన్నారు. ఉపాధ్యాయులంతా డబ్బులు ఎత్తుకొని తనకు నెల నెలా డబ్బులు ఇవ్వాలని, లేకుంటే మీ సంగతి తేలుస్తానని స్కూల్ చైర్మన్ బెదిరిస్తున్నారని ఉపాధ్యాయులు వాపోయారు. రాత్రిపూట, సెలవు దినాల్లో పాఠశాలలో చొరబడి పిల్లల్ని భయపెట్టి మీరు మీ తల్లిదండ్రులు ఫోన్ నెంబర్లు ఇవ్వండి లేదంటే మీకు అన్నం పెట్టమని, తాను చెప్పినట్లు మీ తల్లిదండ్రులు వినాలని బెదిరించారని పిల్లలు చెప్పారు. కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి మనం కలెక్టర్‌కు ఫిర్యాదు చేద్దామని, మీరు రావాలని, లేకుంటే మీ పిల్లలకి పాఠశాలలో భోజనం పెట్టనివ్వకుండా చేస్తానని చైర్మన్ పేరెంట్స్‌ను భయపెట్టారని చెప్పారు. స్థానికుల నుంచి తమకు రక్షణ కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల భయాన్ని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్ వారికి రక్షణ కల్పించాలని, ఉపాధ్యాయుల తప్పు లేకుండా వారిని లంచాలు ఇవ్వమని గ్రోసరీ ఇవ్వమని రకరకాలుగా వేధిస్తున్న వ్యక్తి రిపై ప్రివెన్షన్ ఆఫ్ పబ్లిక్ సర్వీస్ యాక్ట్ కింద కేసు పెట్టాలని కోరారు.



సీతంపేటలో వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అట్టహాసంగా మండలస్థాయి క్రీడలు

ప్రజాశక్తి - సీతంపేట

స్కూల్ గేమ్ ఫెడరేషన్ మండల స్థాయి బాలికల క్రీడలు శుక్రవారం అట్టహాసంగా ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్ని బాలికల ఉన్నత పాఠశాలలో నుండి సుమారు 300 మంది బాలికలు పాల్గొన్నారు. క్రీడల పర్యవేక్షణాధికారి ఎన్ జాకోబ్ దయానంద్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రరావు క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరన్నారు. జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈనెల 17న బాలురుకు స్కూల్ గేమ్స్ మండల స్థాయి క్రీడలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రావు, రమణ మూర్తి, కామేశ్వరి, వెన్నెల, కల్యాణి, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, అండర్ -17 మండల స్థాయి క్రీడా పోటీలుఉల్లిభద్ర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించినట్టు హెచ్ఎం శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుండి 310 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు వ్యాయామ ఉపాధ్యాయులు బి. శ్రీనివాసరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, మండల అధ్యక్షులు బి.దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.గోవిందరావు ఎంఇఒ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత గల ఉపాధ్యాయులకు వర్క్ అడ్జస్ట్మెంట్‌లో లోపాలను సరిచేయాలని, సింగిల్ ఉపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు పనిని సర్దుబాటు చేయాలని అన్నారు. కడాకెల్లా పాఠశాల ఆన్లైన్ సమస్య ఆర్ఎఫ్ నిధులు స్పోర్ట్స్ కిట్టు స్కూల్ నిధులు సమస్యలు పరిష్కరించాలని జెడ్‌పిపిఎఫ్, ఎపిజిఎల్ఐ సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్లో ఉన్న అన్ని రకాల సెలవులు వెంటనే అప్లోడ్ చేయాలని, మూడు కాంప్లెక్స్ లను మెర్జి చేసి కాంప్లెక్స్ లు సమావేశాలను ఒకే చోట నిర్వహించేందుకు చర్య తీసుకోవాలని కోరారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తమ గ్రామాభివృద్ధికి సహకరించి అండగా నిలవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామస్తులు శుక్రవారం వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి రహదారులు, శ్మశాన వాటిక మంజూరు చేయాలని, అలాగే గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెరువును పూడ్చిపెట్టి నిరుపేద దళితులకు ఇళ్ల స్థలాలుగా ఉపయోగపడేలా చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిపరిష్కరించే దిశగా చేస్తానని అన్నారు. వినతిని అందజేసిన వారిలో అక్షయ ఫౌండేషన్ నిర్వాహకులు తిరుపతిరావు, గుమ్మలక్ష్మీపురం మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, కొత్తూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

స్థానిక సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, మెయిన్ రోడ్డులో రద్దీగా ఉండే ప్రదేశాల్లో బాటసారులకు, ప్రయాణికులకు నేడు సమాజంలో చోటు చేసుకుంటున్న వివిధ రకాల నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, చెయిన్ స్నాచింగ్, తాళం వేసిన ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలెవ్వరూ గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు సమాధానమివ్వకూడదన్నారు. ఒటిపిలు ఇతరులకు చెప్పరాదని, తాళం వేసిన ఇళ్లల్లో డబ్బులు, బంగారం, విలువైన వస్తువులు ఉంచరాదని, దొంగతనాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పోలీస్‌లకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్వతీపురం సిసిఎస్ క్రైమ్ ఎస్సై పి తిరుపతి రావు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

వీరఘట్టం : మండలంలోని కిమ్మి సర్పంచ్ జి.రామ్మోహన్‌నాయుడు కుమారుడు జి.జ్యోతీష్ కుమార్ జన్మదిన సందర్భంగా ఆ గ్రామ విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.అప్పల నాయుడు, బి.వాసునాయుడు, ఎం.సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా రైతులకు ప్రకృతి సేద్యంపై శిక్షణ

ప్రజాశక్తి - పాచిపెంట

చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహణలో పనుకువలస, బొబ్బిలివలస, సీతంపేట గ్రామ గిరిజన మహిళలకు నెల రోజుల పాటు ప్రకృతి సేద్యంపై ఆశ్ర సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 60 మంది గిరిజన మహిళలకు ఘన ద్రవ జీవామృతాల వినియోగం తయారీపై శిక్షణ ఇచ్చారు. ఎఒ కె.తిరుపతిరావు, సీనియర్ రీసెర్చ్ ఫెలో డాక్టర్ జయచంద్ర ఆశ్ర కార్యదర్శి జి.రామకష్ణ ఈ శిక్షణ ఇచ్చారు.

ప్రసవానికి ముందే గర్భిణులను హాస్టళ్లలో చేర్చాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రసవసమయానికి ముందుగానే గర్భిణులను వసతి గృహాల్లో చేర్చాలని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం సాలూరు మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన కరడవలసలో ఆయన పర్యటించారు. గ్రామంలో గిరి ఆరోగ్య కేంద్రం, కంటైనర్ హెల్త్ సెంటర్ సందర్శించారు. అత్యవసర సమయంలో డోలిపై తీసుకురావాల్సిన ఇబ్బందులు రాకుండా గిరి ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మాతృత్వమరణాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నూరు శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు, గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలకు సీమంతం కార్యక్రమములో పాల్గొని, టిఎంఆర్ అందజేశారు. రక్త హీనత పరీక్షలు జరుగుతున్నది లేనిది ఆరా తీశారు. గ్రామం పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. గిరిజనులు పండించిన సీతాఫలాల దిగుబడిని చూసారు. పంటకు మార్కెట్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో విడివికె సెంటరును ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ ఉమాను ఆదేశించారు. ఉద్యానవన పంటల అభివద్ధికి ఉద్యానశాఖ, ఉపాధిహామీ చట్టం ద్వారా జీడి, మామిడి వంటి పంటలకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తున్నదని రైతులు వినియోగించుకోవాలని తెలిపారు.



సీతాఫలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలి

మండల సమావేశంలో ఎంపిపి • సీతారాం ఏచూరికి ఘనంగా నివాళి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

సభ్యుల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఎంపిపి ఉరిటి రామారావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. తొలుత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మతికి సభ్యులు సంతాపం తెలియజేస్తూ ఒక నిమిషం మౌనం పాటించారు. అలాగే వైస్ ఎంపిపి బత్తల లక్ష్మి భర్త పకీరునాయుడు ఇటీవల మృతికి సంతాపం తెలిపారు. అనంతరం ఎంపిపి, నాగూరు, రావివలస ఎంపిటిసి సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు), కోట భరత్ కుమార్ (సుమన్) మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో వీధిదీపాలు వేసే బాధ్యత ఇకపై గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉందన్నారు. అనధికారిక వ్యక్తులను విద్యుత్ స్తంభాలు ఎక్కించి బల్బులు వేయించడంవల్ల ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. దీనికి ఎఇ బొంతాడ శంకరరావు సమాధానమిస్తూ ఇకపై గ్రామ సచివాలయాల విద్యుత్తు సిబ్బంది ఆధ్వర్యంలో బల్బులు వేసేలా చర్యలు చేపడతామని సమాధానం ఇచ్చారు. రోడ్లకు ఇరువైపులా పండ్లు, కొబ్బరి మొక్కలు వేయాలని సత్యనారాయణ కోరగా, ఎపిఒ మండల గౌరీనాథ్ మాట్లాడుతూ ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమావేశానికి కిందిస్థాయి అధికారులు హాజరు కావడం వల్ల సభ్యులు తెలిపిన సమస్యలపై సమాధానం చెప్పలేని పరిస్థితి ఉందని, వచ్చే సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ పైడితల్లికి సభ్యులు సూచించారు. సమావేశంలో పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

ప్రజాశక్తి - కురుపాం

కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తహశీల్దార్ రవణమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా సామర్థ్యాన్ని పరిశీలించి రికార్డులను తనిఖీలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు విద్యార్థులను క్రమశిక్షణతో తీర్చిదిద్దాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక ఐటిడిఎ ఉప విద్యాశాఖ అధికారి పాలక నారాయుడు చిన్నబగ్గ ఆశ్రమ పాఠశాలను శుక్రవారం సందర్శించారు. షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలన్నారు. 100శాతం రిజల్ట్ సాధించడం కోసం ప్రతి సబ్జెక్ట్ టీచర్ ఆ సబ్జెక్టులో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ప్యూరిఫైడ్ వాటర్ అందించాలని చెప్పారు. విద్యార్థులకు తాగడానికి వేడి నీరు అందించాలని అన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలి తెలిపారు. టీచింగ్ నోట్స్ విధిగా రాయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని చెప్పారు. గణితంలో వెనుకబడి ఉన్న ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే ఎఎంఒ పి.కోటిబాబు సామరెల్లి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యా ప్రమాణాలు తెలుసుకున్నారు. ఆయన వెంట హెచ్ఎం ఎ.భాస్కరరావు, శ్రీనివాస రావు, డిప్యూటీ వార్డెన్ రామకృష్ణ, ఉపాధ్యాయులు బిడ్డిక పంచమి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్వతీపురంలోని పలు ఉన్నత పాఠశాలలను ప్రత్యేక అధికారులు సందర్శించారు. మండలంలోని పెదబొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రత్యేక అధికారి రమేష్ రామన్, ప్రధానోపాధ్యాయురాలు బి గౌరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతులకు వెళ్లి విద్యార్థులను పరిచయం చేసుకున్నారు. వారి విద్యా ప్రమాణాలను పరిశీలించే ప్రశ్నలు అడుగుతూ విద్యార్థుల నుంచి సమాధానాలను రాబట్టారు. విద్యా ప్రమాణాలను పెంచేందుకు పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను పరిశీలించారు. వాలీబాల్, యోగ ఈవెంట్లలో మండలంలోని పలు హై సల్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి ప్రతినిధి వై.క్రాంతికుమార్, జిల్లా స్పోర్ట్స్ కార్యదర్శి మంతిని వాసుదేవరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం ఆధ్వర్యంలో సచివాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కమిటీ సభ్యులు మీసాల శంకర్రావు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20వేలు వెంటనే ఇవ్వాలని, 2023 ఖరీఫ్, రబీ సీజన్లో పంట నష్టపోయిన రైతులకు బీమా కల్పించాలని, రూ.2 లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ మోటార్లకు మీటర్లు పెట్టాలని తీసుకొచ్చిన జిఒ 22ను రద్దు చేయాలని, కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జన్ని ఈశ్వరరావు, రైతులు కెల్లా నీలయ్య, జన్ని గంగులు, గొర్రెల లక్షణ, ఆల్తి శంకర్రావు, ఆవాల శంకర్రావు, జన్నిపోలరావు పాల్గొన్నారు

వ్యక్తిగత కక్షలతో దాడి

ప్రజాశక్తి - కురుపాం

వ్యక్తిగత కక్షలతో తాగిన మైకంలో దాడి చేయడంతో గౌడు శ్రీధర్ అనే వ్యక్తి తలకు గాయమై ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంఘటన కురుపాంలోని గౌడు వీధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై షణ్ముఖరావు అందించిన వివరాలు ప్రకారం గౌడు లల్లు అలియాస్ రవి నిద్రలో ఉన్న గౌడు శ్రీధర్ తలపై రాడ్‌తో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వీరి ఇరువురి మధ్య గత కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. గాయపడిన శ్రీధర్‌ను స్థానిక సిహెచ్‌సికి తరలించగా, అక్కడి నుంచి పార్వతీపురం రిఫర్ చేశారు. అక్కడ కూడా పరిస్థితి విషయంగా ఉండడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడ్ని అదుపులోనికి తీసుకున్నామని చెప్పారు.



చికిత్స పొందుతున్న శ్రీధర్

40 మందిపై బైండోవర్ కేసులు

పార్వతీపురంరూరల్ : పట్టణానికి చెందిన 40మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరంతా పట్టణ పరిధిలో నాటు సారా అమ్మకాలు చేసేవారు. వినాయక చవితి ఉత్సవాలు సందర్భంగా పాత కేసుల్లో గొడవలకు కారకులు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిగా గుర్తించారు. రాబోయే వినాయక నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అల్లర్లు సృష్టించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో వుండేందుకు గాను ఆదేశాలు తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. బైండ్ ఓవర్ ఉత్తర్వులు ఉల్లంఘించి ప్రవర్తిస్తే వారిపై రూ.2 లక్షలు జరిమానా, చట్ట విరుద్ధ పనులు చేసేవారిగా గుర్తిస్తూ తదుపరి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సోమేశ్వరరావు, సిఐ నారాయణరావు, ఎస్ఐ సంతోషి పాల్గొన్నారు.